# రంగని అంతరంగం

కె. ఆర్. యమ్. శాస్త్రి

"అరేయ్ రంగా! నిజంచెప్పరా! లచ్చిమీద నీకు మనసుందంట్రా?" రాముడు ప్రశ్నించాడు.

రంగడు మౌనం వహించాడు. నోట్లో వున్న చుట్టను ఎడంచేత్తో తీసి, కాండ్రించి ఉమ్మేశాడు. ఆ బడ్డీకున్న నిలువుటద్దంలో తనరూపాన్ని చూసుకొని మురిసిపోయాడు.

రంగడు! ఒటి రంగడు కాదు. ఆ వూళ్లో ఉన్న ఆబాలగోపాలమూ తనపేరు వింటేనే హడిలిపోయేట్లు చేసుకున్న ప్రఖ్యాత "రౌడీ" రంగడు! చేష్టలతోనే రౌడీ అనుకోనక్కర్లేదు. రూపాన్ని చూసి వూహించవచ్చు. దుబ్బుతల, ఎర్రగా చింతనిప్పుల్లా ఉండే అతని నేత్రద్వయము, బుగ్గమీసాలు, దృఢకాయం, ఆజానుబాహులు, గళ్ల లుంగీ, చారల బనియన్, కుడిచేతిలో భీమునిగదలా దుడ్డుకర్ర, కాళ్లకి కిర్రుచెప్పులతో ప్రకాశించే రంగణ్ణిచూసి 'రౌడీ' అని ఏ వ్యక్తి అనుకోడు?

రంగడు తన ఎడమచేతిలోఉన్న చుట్టను తిరిగి నోట్లో పెట్టుకుని, రెండు దమ్ములు గట్టిగాలాగి గాలిలోకి వదిలాడు.

"యాందిరా నువ్వంటుండావ్?" రంగడు అడిగాడు.

రాముడు సందిగ్ధంలో పడ్డాడు. నిజంగా రంగడు తనప్రశ్న వినలేదా? వినేవుండి మరల ప్రశ్నిస్తున్నాడా? వినే మళ్లా ఎందుకు అడుగుతున్నాడు? అతని భార్యను గురించి అడిగినందుకు తనమీద కోపంరాలేదు కద! ఛ!...రంగడికంత త్వరగా కోపం రాదు. అతని భార్యనుగూర్చి అతనే అనేకసార్లు తనతో (తను ప్రాణమిత్రుడు గనక) ప్రస్తావించాడు. తనుకూడా అతని భార్య గురించి అడిగాడు. అప్పుడులేనికోపం ఇప్పుడెలావచ్చింది? చిట్టచివరకు రంగడుతనప్రశ్న వినేవుండడని నిర్ధారించుకుని రాముడన్నాడు. "నీకు నీ పెళ్లాంమీద ప్రేమేముందంట్రా?"

రంగడు బిగ్గరగా నవ్వాడు.

"ఓరి రాంగా! ఈ రంగడి మనసులో నా లచ్చికేరా పెదమత్తానం" అన్నాడు మీసం దువ్వుకుంటూ.

"ఓరెల్లరా! నీ గాసులు నాకాడా! నీదంతా కపటం."

"రాంగా! నడుం ఇరగ్గొట్టేత్తాను. నాకాడిట్టాటి కూతలు కూసేవంటే."

"లాపోతేందిరా! లచ్చెల్లి ఎన్నాళ్లొద్ది? ఇయ్యాల్టికి సరింగా ఏడున్నొక్క రోజు. పాపం...అప్పిల్లే ఎల్లగానే కాండ్రేసింది. దానికి ఎదురుజవాబేశా? చెప్పవాం దొంగనాయాలా! ఇంకో నామీన కోపం సేత్తన్నావే యదవానీ యదవ."

రంగడు నిర్ఘాంతపోయాడు. నిజమే! తను రాంగాడిమీద కేకలేస్తాడెందుకు? లచ్చి వెళ్లి ఇవ్వాల్టికి ఎనిమిదిరోజులు. పురిటికని పుట్టింటికెళ్ళింది. చేరినరోజునే కార్డురాయించింది. జవాబు రాయమని మరీ మరీ చెప్పింది. కాని, తనిన్ని రోజుల నుంచి జవాబే రాయలేదు. పిచ్చిలచ్చి. ఏమనుకుంటుందో ఏమో! తన స్నేహితుడే! తన స్నేహితుడే తనకు లచ్చిమీద ప్రేమ లేదనంటుంటే ఇక సొంతభార్య ఏమనుకుంటుంది? లచ్చి! తనంటే ప్రాణం ఒదుల్తుంది. తను క్షణం కనిపించకపోతే ఎంతో ఆదుర్దా పడుతుంది.

ఈ ఆలోచనలు రావడంతోటే రంగడి హృదయం ద్రవించింది. ఆక్షణంలో ఎన్నో రోజుల్నుంచి వస్తున్న వాడిలా అయిపోయాడు. రంగడిలో కలిగిన ఈ చంచలానికి హేతువేదో రాముడికి సులభంగా గ్రాహ్యమైంది.

"ఏందిరా, అట్టాగైపొయ్యావు?" అని అడిగాడు రాముడు.

"రాంగా, సాలా పెద్ద పొరపాటు సేశాన్రా! ఇయ్యాలే కాయిదాసేత్తాను. నా తప్పు క్షమించమని యేడుకుంటాను, పోటాఫీసుకెల్తన్నా!" నంటూ కదిలాడు. రాముడు అతన్ని వెనక్కి పిల్చాడు. రంగడు వెనక్కి వచ్చాడు. 'ఏమిటి?' అన్నట్లు రాముడి కళ్లలోకి చూశాడు.

"రంగోయ్! ఎట్టనో కాయిదేత్తన్నావు గనక ఆ ఏసేది జంట కాయిదెయ్యి. ఎందుకంటే ఆ పిల్ల యంటనే జవాబు రాత్తానికి యీలుంటది" అన్నాడు రాముడు.

"సర్లే" అంటూ దుడ్డుకర్రోసారి జళిపించి పోస్టాఫీసుకేసి రంగడు వడివడిగా నడవసాగాడు.

## 2

పోస్టాఫీసు చిన్నది. ఒక్కటే రూము. పోస్టుమాస్టరు ఒక్కడే; అసిస్టెంట్స్ ఎవ్వరు లేరు. కార్డులు సప్లయి చెయ్యడం మొదలు కొని వచ్చిన ఉత్తరాలు వూళ్ళో బట్వాడా చెయ్యడం వరకూ ఆయన పనే. అంచేత ఉదయం తొమ్మిది మొదలు పదకొండున్నర వరకూ మాత్రమే కార్డులు మొదలైనవి అమ్మడం; డబ్బాలో వేసిన వుత్తరాలు తియ్యడం జరుగుతుంది. ఖర్మం చాలక ఎవరైనా టైమ్ తెలీక పదకొండున్నర దాటి వస్తే, కార్డులకి కార్డులూ దొరకవు—డబ్బాలో వేసిన వుత్తరాలూ వెళ్ళవు. ఇదే ఆ చిన్న పల్లెటూళ్లో వున్న పోస్టాఫీసు సంగ్రహ చరిత్ర.

ఆ పోస్టాఫీసులో కొత్త పోస్టుమాస్టరు జాయినయి ఇంకా నెలరోజులు దాటలేదు. ఆయనపేరు రంగాచారి. ఒట్టి ముక్కోపి. సహనరహితుడు. రంగాచారిది గుడివాడ. ప్రొద్దున్నే కాఫీ, టిఫిన్ సేవించి ఎనిమిది గంటలకల్లా తాతలనాటి తన త్రొక్కుడు బండి (సైకిల్) పై బయలుదేర్తాడు. గుడివాడకీ ఆ గ్రామానికి ఎక్కువదూరం లేదు. అంచేత ఓ అర్ధగంటలో అక్కడికి చేరుకుంటాడు. పన్నెండున్నర అయ్యేసరికల్లా పని ముగించుకుని, తిరిగి తన త్రొక్కుడుబండిపై వుంటాడు రంగాచారి. ఇదీ ఆయన దినచర్య. పాపం ఆయనకి ఆ వూరి విషయాలు సరిగ్గా తెలియవు. తెల్సుకోవలసిన ఆవశ్యకత కూడా లేదు.

ఆ రోజున అరగంట—(అంటే 9½ గంటలకు) లేటుగా పోస్టాఫీసు తలుపులు తెరిచాడు రంగాచారి. రోజూ చిక్కి, సిరిగి ఒక్కొక్కళ్ళు వచ్చే జనం యివ్వాళ తండోపతండాలుగా వచ్చి, ఆఫీసు కిటికీవద్ద 'క్యూ' లో నిల్చున్నారు. రంగాచారి కిటికీ కవతల కుర్చీలో వేసుక్కూచుని ఎవరెవరికి ఏవేం కావాలో అడిగి తెల్సుకుని, కొత్తగా వెలువడిన 'నయాపైసాల' లెక్క ప్రకారం ఇచ్చివేస్తూ సాధ్యమయినంత వరకు, ఆజనసంఖ్యను తగ్గించాలని ప్రయత్నిస్తున్నాడు.

రౌడీ రంగడు పెద్ద-పెద్ద అంగలతో పోస్టాఫీసును సమీపించాడు. అతని అడుగుల చప్పుడు వినగానే కిటికీవద్ద వున్న వాళ్ల ముఖాలు వెలవెల బోయాయి. మిలిటరీ డ్రిల్లులాగా ఎవరికి వాళ్లు పక్కకి ఒదిగి నిల్చున్నారు. రంగడు చేతిలోవున్న కర్రను గోడకానించి రివిగా కిటికీవద్దకు వెళ్ళాడు. రొండినుంచి బేడకాసు తీసి రంగాచారికిచ్చి "జంటకాయిదోటియ్యవయ్యా!" అన్నాడు.

## ★ రంగని అంతరంగం ★

రంగాచారి జంటకొర్డు తీసి, దానిమీద కానీకాసుంచి రంగడికిచ్చాడు. రంగడు కానీ కాసువంక విచిత్రంగా చూశాడు.

"ఏందయ్యా ఇది?" గట్టిగా అన్నాడు.

"ఏందీ లేదు. బూందీ లేదు. ముందునడువ్ అవతలికి." రంగాచారి విసుగ్గా అన్నాడు.

"ఏయ్ ఆసారీ! ఏంది మా ఇస్సురుగా మాట్లాడుతుండావ్! జంటకొర్డు అణా, ముక్కాలెట్లయింది?"

"అంతేలేగాని అవతలికి నడువ్. మహా లెక్కడ గొచ్చావ్."

"ఏందయ్యోవ్ మాజోరుగా అనేతుండావ్. ఈడెవడో నీకింకా తెలీదు. కాడీ రంగడు. పొగరు బోతోళ్లతల్లో జేజెమ్మ. నాను సదువురానోణ్ణయినా, డబ్బుకాడికొచ్చే సరికి సదువుకున్నోళ్లు కూడా నాకోడ దొబ్బు. తెల్సా! అణా ముక్కాలికి వచ్చుకొండు నయాపైసాలు. జంట కొర్డుకు పది నయాపైసలే. ఇంకో నయాపైస నాకే రావాల్నే!" రంగడు లెక్కచెప్పాడు.

కాడీ రంగడి పేరు వినేసరికి రంగాచారి గుండెల్లో రైళ్లు పరుగెత్తినై. చేతులు వణికాయి. రంగడివంక బిత్తర చూపులు చూడసాగాడు. వెంటనే తమాయించుకున్నాడు. అక్కడున్న జనంముందు తన పిరికితనం బైటపడితే, వాళ్లకి లోకువగా కనిపిస్తాడేమోననే భయంతో రంగడికి నచ్చజెప్పే విధానంలో ఇలా అన్నాడు:

"ఇదుగో అబ్బాయ్! నాదేముందిది? వుద్యోగం చేస్తున్న ప్రతి వ్యక్తి ప్రభుత్వం వారి ఆజ్ఞలకు సర్వదా బద్ధుడై తన కర్తవ్య నిర్వహణ చేస్తున్నాడు. అంతేగాని తన ఇష్టప్రకారం మాత్రం నడవడం లేదు. మీరు వేసకొనిచ్చి జంటకొర్డిమ్మని అడిగినప్పుడు మాదగ్గర ఒక 'నయాపైసా' నాణెములు నింపుకున్నప్పుడు, జంటకొర్డును ఒక అణా ఒక ముక్కాని నాణాలుతో అమ్మరాదని కట్టి అభ్యంతరంగాని వుండదని ప్రభుత్వము వారి ఆజ్ఞ."

రంగడు సింహగర్జన చేసి క్రొండించి వుమ్మేశాడు.

"పెబుత్వమంట పెబుత్వం. మాయంటోళ్ళకి పెట్టం సేతగాదుగాని మా కాడున్న నాణాలుసేసి ఆళ్లే జల్సాలు కొడుకుంటారు." కసిగా అంటూ వెనక్కి వెళ్లి అరుగుమీద చతికిలబడి తాపీగా చుట్ట వెలిగించాడు, రంగడు.

### 3

సైకిలెక్కిన పోస్టుమాస్టర్ రంగాచారి కర్ణపుటాల్లో రంగడి పిలుపు భీకరంగా ప్రతిధ్వనించింది. చటుక్కున దిగాడు. ఇందాక ట్నుంచి తన కోసమే కాచుకుని వున్నాడేమో అనుకుని ఆపాద మస్తకం ఆకులా గజ-గజలాడాడు. సైకిల్‌కి స్టాండువేసి భయం భయంగా రంగణ్ని సమీపించి అర్ధ నిమీలిత నేత్రాలతో "ఏమిట"న్నట్లు అతన్ని చూశాడు ఆచారి.

"మనదే వూరు? ఎక్కడుంటండావ్" అడిగాడు రంగడు.

"గుడివాడ సత్యనారాయణపురం చివర ఫ్యాక్టరి నీరుపోయే కాలువ లేదూ! దాని కవతల గుడిసెలు కొన్ని వున్నయ్యి! ఆ గుడిసెలు కెదురుగా ఈవలి గట్టున డాబాలో."

"దండాలుబాబూ! తమ రెవరో ఎరక్క అపకారం సేశా. కూసోండి. ఓ మాట సెప్పాల" అన్నాడు రంగడు, చివ్వున అరుగుమీంచి లేచి ఆచారికి నమస్కరిస్తూ.

రంగాచారికి వణుకు తగ్గింది. నెమ్మదిగా పోయి అరుగుమీద కూచున్నాడు.

"ఆసారిగోరూ! ఆ గుడిసెల్లో చెంగన్నని మామా వున్నాడు తెల్సాండి?" రంగడు అడిగాడు.

"ఎవరూ! ఆమూతి వంకర చెంగన్నా?"

"అవును బాబూ!"

"అరె నీకడుపుకాల! వాణ్ణెక్కపోవకేమిట్రా! మా పొలం పని చేస్తాడ్రా వాడు వాడి అల్లుడివా నువ్వు? చంపేశావ్ పో. వారం రోజుల క్రితం వురిటికి నీ భార్య అక్కడికొచ్చిందగా. వచ్చిన రోజునే నీకో వుత్తరం నా చేత రాయించింది. వెధవాయ్. దానికి జాబే రాయలేదుట గా? అంత తీరిక లేకపోయిందా ఏం? పాపం... అది రోజూ నాతో చెప్పడమే, "వుత్తరం రాయమని అతనికి చెప్పండని.' నువ్వెవరో ఇప్పటి వరకూ నాకు తెలీదుగా."

"మరిసే పోయానా సారిబాబూ! ఇయ్యాళ అయినా రాంగాడు గురుతు సేశాడు. కొంచెం ఈ కాడు రాసి పెట్టరూ!" ప్రాధేయ పడ్డాడు రంగడు.

"నాకు చాలా ఆలస్యమైందిరా! ఇంకా వుత్తరాలు బట్వాడా చెయ్యాల్సిన పనోటి వుంది."

"ఓస్. ఇదెంత పని ఆసారి బాబూ! నిటికెలో సేసేత్తాను. నాను సెప్పిన యిసయాలు దీని మీద రాసెయ్యండి. వుత్తరాలు నిమసంలో ఎవరియారికి పారేసొత్తా."

"సరే... చెప్పు."

"తొందర పాటెక్కువగాని నిజంగా రంగడి హృదయం నవనీతంగాదూ!" అనుకున్నాడు పోస్టుమాస్టర్ రంగాచారి, రాయడాని కుపక్రమిస్తూ. ★


# జీవితమును మలబద్ధకము భారముగా చేయనీయకండి




తలనొప్పులు, కోపిష్ఠితనము, ఆకలిమాంద్యము, నిస్పృహ, మందగొడితనము ఇవన్ని శరీరములోని అపరిశుద్ధతకు పర్యవసానములు కావచ్చును. కాని మలబద్ధకము మీ జీవితాన్ని పెద్ద భారముగా చేయనవసరము లేదు. బ్రూక్‌లాక్స్ సేవించగనే తిరిగి వచ్చును. నేడే రుచికరమైన యీ చాకొలెట్ విరేచనకారి మలాశయమును శుభ్రపరచి మలిన పదార్థమును తప్పక నిరపాయముగా వెడలగొట్టును. ఈ రాత్రి ఒక చిన్న ముక్క వేసుకోండి. రేపు ఎంత చలాకీగా, ఎంత చురుకుగా వుంటుందో గమనించండి. కాని తప్పక మీరడిగేది బ్రూక్‌లాక్స్ అని మాత్రం దృఢం చేసుకోండి.

## బ్రూక్‌లాక్స్

మిమ్మల్ని రాత్రికి రాత్రి సరిదిద్దును

(పెద్ద పిల్లలకు లాక్సొనింస్ లిమిటెడ్, ఇంగ్లండువారి నిర్మాణము)

ఇండెంటింగు ఏజంట్లు: ఓరియంటల్ మర్కెంటైల్ ఏజన్సీ, మద్రాసు-1,

బ్రాంచి : 17/117 నాగేశ్వరరావురోడ్, విజయవాడ-2.